పారదర్శక పాలన


బొండపల్లి: ఒంపల్లిలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిన్నంనాయుడు


లక్కవరపుకోట: గంగుబూడిలో పార్టీ జెండాను ఎగరవేస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు


వేపాడ: వీలుపర్తిలో ఇంటింట ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు


గంట్యాడ: రామవరం సభలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి


శృంగవరపుకోట: సంతగవిరమ్మపేటలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు


దత్తిరాజేరు: ఇంగిలాపల్లిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు


కొత్తవలస: కంటకాపల్లిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ శ్రీదేవి,తదితరులు


చీపురుపల్లిరూరల్(గరివిడి): కోనూరులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న గరివిడి మండల నాయకులు


జామి: విజినిగిరిలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్, ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ సరయు


గుర్ల: తెట్టంగిలో ర్యాలీ చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకులు సన్యాసినాయుడు, బంగారునాయుడు


చీపురుపల్లిరూరల్: కరకాంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో అవినీతి రహిత, పారదర్శక పాలనసాగుతోందని, అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పలుగ్రామాల్లో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి, జరిగి న అభివృద్ధిని వివరిస్తూ సచివాలయాల వద్ద ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు బోర్డులను ఆవిష్కరించారు. గ్రామాల్లో పెద్దలు, స్థానిక నాయకుల సమక్షంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింట ప్రచారం నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి పల్లెనిద్ర చేశారు. బుధవారం రాత్రి పల్లెనిద్ర చేసిన నాయకులు గురువారం ఉదయం గ్రామాల్లో ప్రచారం చేశారు. సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న 2024 ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

– గజపతినగరం/ చీపురుపల్లి/ఎస్.కోట సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి త్రోబాల్‌పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం సత్యనారాయణ, గ్రామపెద్ద

మెరకముడిదాం: మండలంలోని బిళ్లలవలస ఉన్నత పాఠశాల నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు పదోతరగతి విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని హెచ్ ఎం బి.సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈనెల 21న నెల్లిమర్లలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్–17 బాలికల విభాగం లో గెద్ద సమీర, బాలుర విభాగంలో విజినిగిరి యశ్వంత్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను హెచ్‌ఎం. పీడీ వి.వెంకటరమణ, గ్రామపెద్ద వర్మరాజు, ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరరాజు, తదితరులు అభినందించారు.

ఏకాదశి పూజలు


గజపతినగరం శివాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

గజపతినగరం: కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శివాలయం లో, పురిటిపెంట గ్రామంలోని సంతతోట శివాలయంలో అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజపతినగరం, వెంకటాపురం,పురిటిపెంట, దావాలపేట, బూడిపేట, శ్రీరంగరాజపురం తదితర గ్రామాల నుంచి భక్తులు ఆలయాలకు పెద్ద ఎత్తున తరలివచ్చి అర్చనలు, అభిషేకాలు చేశారు.

శబరిమలకు పాదయాత్ర


శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప భక్తులు


దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి,రామచంద్రాపురం గ్రామాల నుంచి అయ్యప్పస్వామి భక్తులు శబరిమలకు పాదయాత్రగా గురువారం బయలుదేరారు. సుమారు 2వేల కిలోమీటర్లు నడిచి మకర సంక్రాంతి రోజున జ్యోతి దర్శనానికి శబరిమల కొండపైకి చేరుకుంటామని గురుస్వామి గెరిడ రామారావు తెలిపారు.

బ్యాంకింగ్ సేవలపై కళా జాత


బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

శృంగవరపుకోట: ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక అక్షరాస్యతపై స్థానిక ఎస్‌బీఐ వ్యవసాయ అనుబంధ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నాబార్డ్ సౌజన్యంతో గురువారం కళాజాత నిర్వహించారు. మెజీషియన్స్ విభూతి బ్రదర్స్ తో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి, సురక్షయోజన, అటల్ పెన్షన్ జనరల్ ఇన్స్యూరెన్స్, బంగారంపై రుణ సౌకర్యం, పీఎం విశ్వకర్మలో ఆర్థీ అకౌంట్ తదితర అంశాలను, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పాటల ద్వారా వివరించారు. ఎస్‌బీఐ వ్యవసాయ అనుబంధ శాఖ బ్రాంచ్ మేనేజర్ హరికృష్ణ, సీఏస్పీలు పాల్గొన్నారు.

ప్రతినెలా ఆడిట్


మాట్లాడుతున్న ఏపీడీ సావిత్రి

గజపతినగరం: స్వయం సహాయక సంఘాల లావాదేవీలపై ప్రతినెలా ఆడిట్ నిర్వహించుకోవాలని వెలుగు ఏపీడీ కె.సావిత్రి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా ఆడిట్ చేసుకుంటే లావాదేవీలపై పూర్తి అవగాహన వస్తుందని చెప్పారు. గ్రూపులో ఉన్న ప్రతీ సభ్యురాలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కావాల్సిన తోడ్పాటు ఇవ్వాలని, స్వయం ఉపాధి అవకాశాల కోసం బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ), పీఎంఎఫ్ఎం పథకాల ద్వారా రాయితీతో కూడిన స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా సభ్యులను చైతన్యపరచాలని చెప్పారు. డీపీఎం జె.లక్ష్మునాయుడు, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ బి.రవికుమార్, ఏపీఎం(హెచ్‌డి) కె.గీత, ఏపీఎం(ఎస్‌వీఈపి)ఎస్.ఇందిరా దేవి, స్థానిక ఏపీఎం యు.జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

- నేడు గజపతినగరంలో 273 మందికి ట్రైసైకిళ్లు, వీల్‌చైర్ల పంపిణీ
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే అప్పలనరసయ్య


ట్రైసైకిళ్లు, వీల్‌చైర్ల పంపిణీకి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని విధాలా అండగా ఉంటోందని, వారి సంక్షేమానికి, ప్రగతికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గజపతినగరం, దత్తి రాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి, మెంటాడ మండలాలకు చెందిన 273 మంది దివ్యాంగులకు ప్రభుత్వం ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు మంజూరు చేసింది. గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీటిని శుక్రవారం పంపిణీ చేయనున్నా రు. సంబంధిత ఏర్పాట్లను ఎమ్మెల్యే అప్పలనరసయ్య గురువారం పరిశీలించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్ల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. పుట్టుకతో లేదా ప్రమాదవశాత్తు అంగవైకల్యం ఏర్పడి నడవలేని వారికి ట్రైసైకిళ్లు, మరి కొంతమందికి వీల్ చైర్లను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. లబ్ధిదారులకు ఇప్పటికే ఆయా మండలాల ఎంపీడీఓల ద్వారా సమాచారం అం దించామని తెలిపారు. జెడ్పీటీసీ గార తవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కె.రామునాయుడు, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆర్. సత్యనా రాయణ, ప్రకాశరావు పట్నాయక్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న జిల్లా క్రీడాప్రాధికారి సంస్థ సీఈఓ రాంగోపాల్‌వర్మ

దత్తిరాజేరు: గ్రామాల్లో క్రీడాకారులను వెలికితీసేందుకు సచివాలయాల స్థాయిలో డిసెంబర్ 15 నుంచి నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను విజయవంతం చేయాలని జిల్లా క్రీడాప్రాధికారి సంస్థ సీఈఓ రాంగోపాల్‌వర్మ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ ఎం. వెంకటరావుతో కలిసి వ్యాయామ ఉపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల పోటీలు ప్రారంభం నాటికి అన్ని సచివాలయాల పరిధిలో మైదానాలను సిద్ధం చేయాలని, క్రీడా పరికరాలు సమకూర్చాలని సూచించారు. ఎంపికై న క్రీడాకారులను మండల స్థాయి పోటీలకు, మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయి కి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. గుర్తించిన క్రీడాకారులకు ఇప్పటి నుంచే శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: మండలంలోని పలు ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈఈ ఆర్.శంకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. నెలివాడ ఫీడర్ పరిధిలో నెలివాడకు, బొండపల్లి ఫీడర్ పరిధిలోని బొండపల్లి, కెరటాం, తమటాడ, బిళ్లలవలస, గొలలపేటకు, గొట్లాం ఫీడర్ పరిధిలోని గొట్లాం, అంబటివలస, అయ్యన్న అగ్రహారం, జియ్యన్నవలసకు, గరుడుబిల్లి ఫీడర్ పరిధిలోని గరుడబిల్లి, వేంద్రాం, కొండకిండాం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

28న పీడీఎస్ బియ్యం వేలం

కొత్తవలస: మండలంలో అక్రమంగా నిల్వచేసిన, రవాణా చేస్తుండగా పట్టుకుని సీజ్ చేసిన 67.02 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఈనెల 28న వే లం వేయనున్నట్లు సీఎస్‌డీటీ కె.ఇందిర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద మధ్యాహ్నం 3 గంటలకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద బియ్యం నిల్వ ఉంచామని, వేలం పాటలో పాల్గొనదలచిన వారిని వీటిని పరిశీలించుకొవచ్చని సూచించారు. రూ.2వేల డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ శాంతి


మూడు రోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

చీపురుపల్లి: అర్హులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) బి.శాంతి కోరారు. సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్(స్వీప్)లో భాగంగా పట్టణంలో గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ మూడు రోడ్ల జంక్షన్, మెయిన్‌రోడ్, గాంధీబొమ్మ జంక్షన్ వరకు సాగింది. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఓటుకు నోటు చేటు, ఓటే వజ్రాయుధం వంటి నినాదాలు చేశారు. అంతకుముందు ఆర్డీఓ శాంతి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు నమోదుకు డిసెంబర్ 12 వరకు సమయం ఉందన్నారు. ఓటు హక్కు నమోదు కోసమే స్వీప్ నేతృత్వంలో వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమా లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో ఓటు హక్కు నమోదుకు అన్ని పోలింగ్ బూత్‌ల్లో ప్రత్యేక క్యాంపైన్ నిర్వహించున్నట్లు తెలిపారు. చీపురుల్లి, గరివిడి తహసీల్దార్‌లు ఎం.సురేష్, టి.గోవిందరావు, డిప్యూటీ తహసీల్దార్‌లు సంతోష్, సురేష్, ఎస్‌ఐ ఏ.సన్యాసినాయుడు, డీఎస్‌ఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు


మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల డీటీ నారాయణమ్మ

కొత్తవలస: ఓటర్ల నమోదుకు అన్ని పోలింగ్ బూత్‌లు వద్ద డిసెంబర్ 2,3 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల డీటీ నారాయణమ్మ సూచించారు. స్థానిక పింఛన్‌దారుల భవనం లో బీఎల్‌ఓలు(బూత్ లెవెల్ అధికారులు)తో ఏఈఆర్‌ఓ, తహసీల్దార్ శ్రీనివాస మిశ్రా ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయ ణమ్మ మాట్లాడుతూ రెండు చోట్ల ఓట్లు ఉన్న వ్యక్తులను గుర్తించి, వారికి నోటీసలులు పంపించి వారు కోరుకున్న చోట ఓటు ఉంచి, వేరొక చోట ఓటును తొలిగించాలన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులు ఇతర అంశాలపై వచ్చిన క్లయిమ్స్‌పై ఇంటింటికీ వెళ్లి విచారణ చేసి సకాలంలో పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటర్‌గా నమోదు చేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

వరి పంటకోత ప్రయోగం


నీలకంఠరాజపురంలో పంట కోత ప్రయోగం చేస్తున్న ప్రకృతివ్యవసాయ అధికారులు, సిబ్బంది

వేపాడ: నీలకంఠరాజపురంలో రైతు వేచలపు రామ్మూర్తినాయుడు ప్రకృతివ్యవసాయ విధానంలో సాగుచేసిన వరి పంట క్షేత్రంలో ఏపీ సీఎస్‌ఎఫ్ నార్త్ జోనల్ ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్‌టీఓ శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. దిగుబడి ఆశించిన స్థాయిలో ఉందని వారు చెప్పారు. అలాగే కృష్ణారాయుడుపేటలో దుంగల దేముడు పొలంలో ఏటీఎం విధానంలో మోడల్ సీడ్ సోయింగ్ చేయించారు. వివిధ రకాల కూరగాయల పంటలను సాగు చేయడం వల్ల ప్రతి నెలా ఆదాయం పొందవచ్చని అన్నారు. ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ సన్యాసమ్మ, మండల టీమ్ లీడర్ పి.వసంత, హెల్త్ అండ్ న్యూట్రిషియన్ జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

జామిలో 'ఫ్యామిలీ డాక్టర్'


శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సామ్రాజ్యలక్ష్మి

జామి: స్థానిక గ్రామసచివాలయం–2 పరిధిలో వైద్యాధికారి ఆర్.సామ్రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరంలో ఓపీ (అవుట్ పేషెంట్) సేవలందించారు. ప్రజలకు బీపీ, సుగర్, తదితర వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గృహ సందర్శన చేసి సేవలందించారు. ఈసంద ర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వృద్ధులు తర చూ బీపీ, సుగర్ పరీక్షలు చేయించు కోవాలని సూ చించారు. వైద్య సిబ్బంది ఫ్లోరెన్స్, సత్యప్రసాద్, రాజు, లత, లిఖిత, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ

గుర్ల: మండలంలోని భూపాలపురంలో 2022–23 ఆర్థిక సంవత్సర ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్‌పై ఆ శాఖ అధికారులు సర్పంచ్ విజయకుమారి ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి సిబ్బంది పనులు, నిధుల వివరాలు, లోటుపాట్లను సభకు వివరించారు.ఉపాధి హామీ పనులను సక్రమంగా చేపట్టాలని అధికారులకు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సూచించారు. ఏపీఓ కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి


బొండపల్లి: కొవ్వాడపేటలో సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలకు హాజరైన భక్తులు


గుర్ల: అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలను సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు అతిథిగా సీతం కళాశాల కరస్పాండెంట్ మజ్జి శశిభూషణరావు హాజరయ్యారు. సత్యసాయిబాబా చిత్రపటానికి పూజలు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

4వేల మందికి అన్నదానం

గుర్ల: సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలను సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 4 వేల మందికి అన్నదానం చేశారు.

గజపతినగరంలో..

గజపతినగరం: స్థానిక సత్యసాయి గీతా మందిరంలో సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు సత్యసాయి బాబా విగ్రహానికి అభిషేకాలు, పూజలు చేశారు. మధ్యాహ్నం గీతామందిరం వద్ద భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం సత్యసాయి పల్లకీ సేవ నిర్వహించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కొత్తవలస: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా జయంతిని గురువారం నిర్వహించారు. సత్యసాయిబాబా మందిరం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. సత్యసాయి సేవా సమితి కన్వినర్ పి.రవికుమార్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం పల్లకీ సేవ చేశారు.అలాగే ఎల్.కోట మండలంలోని పలు గ్రామాల్లో సత్యసాయి జయంతిని నిర్వహించారు. శ్రీరాంపురంలో అన్నసమారాధన నిర్వహించారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులో ఉన్న సత్యసాయి సేవా సమితి నేతృత్వంలో గురువారం సత్యసాయిబాబా జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. సేవా సమితి నేతృత్వంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులకు సత్యసాయి సేవాసమితి సభ్యులు బహుమతులు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమాలను సేవాసమితి కన్వినర్ పి.కేశవరావు, డాక్టర్ త్రినాథరావు, శ్రీనాథు వెంకన్న తదిరులు పర్యవేక్షించారు.


గజపతినగరం: భజన చేస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు


కొత్తవలస: సత్యసాయిబాబా పల్లకీ సేవ


శృంగవరపుకోట: భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న సత్యసాయిసేవాసమితి సభ్యులు